


# మనమెరుగని జీవిత సత్యం

శ్యాముల జయరామిరెడ్డి

గోడమీద ఏదో నీడ కదిలినట్లైంది. దఢీమని చప్పుడు. మిట్ట మధ్యాహ్నం-నిశ్శబ్దం. అందరూ నిద్రపోతున్న వేళ-పరధ్యానంగా బట్టలు ఉతుక్కుంటున్న అమ్మాజీ భయంతో ఒళ్ళంతా జలదరించినట్టై తలెత్తి చూసింది. ఎద్దంత ఉన్నది ఆ కోతి! వేపచెట్టు మీదనుంచి మొండిగోడ మీదకు ఒక్క గెంతు గెంతింది. దాని వెనకనే మరొక కోతి. "అమ్మో కోతులు!" అని అరుస్తూ తలుపుల్లోని పొయ్యింట్లోకి పరుగెత్తింది అమ్మాజీ! ఆ అమ్మాయి అరుపు విని బయట అరుగు మీద బీడీ కాల్చుకుంటున్న నాగులు లోపలకు వచ్చాడు. అతను రౌడీ. ఆ ఇంటికి, ఆ ఇంట్లో వున్న యువతులకు రక్షకుడు. అతని వెనకనే సావిత్రి, సరోజిని, సత్యవతి-తన మహా కాయాన్ని ఈడ్చుకొంటూ ఇంటి ఓనరు కనకమ్మ "అయ్యో, అయ్యో, పొద్దున వడించిన అన్నం గిన్నె పొయ్యింట్లోనే ఉంది. ముదనష్టపు కోతులు లాక్కుపోతాయి! చూస్తావేంరా నాగులూ నాలుగు అంటించక!" అంటూ. బిలబిలమంటూ అంతమంది మనుషులు వచ్చినా ఆ కోతులు అదరలేదు. బెదరలేదు. ఏ క్షణంలోనైనా మీదకు దూకబోతున్నట్లు, కోపంగా పళ్ళికిలించి గుర్రుమంటూ చూస్తున్నాయి. నాగులు కట్టెపుల్ల ఒకటి చేతబుచ్చుకొని "అయ్" అంటూ చెయ్యి పైకెత్తాడు. రెండు కోతుల్లోనూ చిన్నది వేపకొమ్మ పట్టుకొని మీదకు దూకబోతున్నట్లు ముందుకు ఊగింది. కాని దూకలేదు. పెద్దకోతి మాత్రం నిర్భయంగా గోడమీద కూర్చుని తమాషా చూస్తున్నట్లుగా ఉంది. "దీని కడుపుడక — దొంగతిండి తిని ఎట్టా బలిసిందో చూడు! అట్టా చూస్తూ నిలబడ్డావేంరా. ఆడంగి వెధవా, రెండుపుచ్చుకోక!" అంటూ పొయిలోఉన్న పెద్ద కట్టెఒకటి తీసుకొని ధీమాగా రెండడుగులు ముందుకేసింది కనకమ్మ. "ధాయ్" అంటూ నాగులు....బాగా దగ్గరకు రానిచ్చి నాగులు మీదకు దూకింది పెద్దకోతి. దాన్ని చూసి చిన్న కోతికూడ ధైర్యంతెచ్చుకొని కనకమ్మ మీదకు లంఘించింది! క్షణంలో కనకమ్మ జాకెట్టు పీలికలై పోయింది. నాగులు ముఖమంతా గాట్లు! రక్తం! అదిరిపోయి. నాగులుతోసహా అందరూ ఇంట్లోకి దూరి తలుపేసుకున్నారు. కోతులు రెండూ తాపీగా పొయ్యింట్లో ప్రవేశించి, అన్నంగిన్నె తీసుకెళ్ళి మొండిగోడ మీద పెట్టుకొని ధైర్యంగా, నిశ్చింతగా తినసాగాయి. తలుపు మూసుకుని కిటికీలోంచి వీళ్ళందరూ ఎంత అరిచినా, కర్రలు చూపెట్టినా ఆ కోతులకు చీమ కుట్టినట్లు కూడాలేదు. మధ్యమధ్య పళ్ళికిలించి వాళ్ళను బెదిరిస్తూ అన్నమంతా పూర్తిగా తినేసి ఖాళీ గిన్నెను నేలమీదకు విసిరికొట్టి, నింపాదిగా తమస్థావరమైన పి. డబ్ల్యు. డి. గెస్ట్‌హౌస్ ఆవరణలోని చెట్లమీదకు వెళ్ళిపోయాయి! "మాయదారి కోతులు, ఈ ఊరికి ఈ బెడద ఎప్పుడు విరగడై పోతుందోనమ్మా. వండుకున్న కూడు తిన్నదాకా నమ్మకమేలేదు" అని గొణుక్కుంటూ అన్నం గిన్నె తెచ్చి లోపల పెట్టుకుంది కనకమ్మ. బ్రతుకు జీవుడా అనుకుంటూ బకెట్లో మిగిలిపోయిన రెండు జాకెట్లు పిండి ఆరవేసి అమ్మాజీకూడా లోపలకు వెళ్ళిపోయింది.

చీకటి పడింది. వీధిలో దీపాలు వెలగటం మొదలెట్టాయి. కనకమ్మ 'కంపెనీ'లో-మర్యాదగా చెప్పాలంటే సంచలనం మొదలైంది. అప్పటివరకూ ఒళ్ళు తెలియకుండా నిద్రపోయిన యువతులంతా స్నానాలుచేసి, ధగధగ మెరిసిపోయే నైలాన్ చీరెలు ధరించి, అంగుళం మందం పౌడరు పొర, సెంటు వాసనలతో తయారై వీధి గుమ్మంలో తిరగాడటం మొదలెట్టారు. రసిక మహాజనులు ఒక్కొక్కరే ఆ ఇంటిని పావనం చెయ్యసాగారు" బూట్లు, చెప్పులు- బెల్‌బాటమ్స్, ముతక పంచెలు-రెండు రూపాయల వాళ్ళు, పది రూపాయలవాళ్ళు ఎవరితాహతుకు సరిపోయినసరుకు వారికి దొరుకుతుంది కనకమ్మ 'కంపెనీ'లో! అమ్మాజీ పది రూపాయల క్లాసు. వాకిట్లోనూ,

కిటికీల దగ్గరా నిలబడి విటులను ఆహ్వానించే అవసరం ఆ అమ్మాయికి లేదు.

తొమ్మిదిగంటల ప్రాంతంలో అమ్మాజీకి మొట్టమొదటి బోణీ బేరం.... ఎవరో పాటు గూరి వాడిలా ఉన్నాడు. టెరిలిన్ బట్టలు, బూట్లు. వాసన .. మందు పుచ్చుకొన్నట్లుంది. సవిలాసంగా సిగరెట్ పీలుస్తూ స్వంతఇంట్లోకి వెళ్లే ఎంతో చనువుగా వచ్చి వయ్యారంగా మంచంమీద కూర్చున్నాడు. మింగేసేట్లు వెకిలి చూపులు!

"డబ్బివ్వండి ముందు" అమ్మాజీ చెయ్యి చాపింది.

"ఏం. అంత అనుమానమా?"

"అనుమానంకాదు. అనుభవం. బ్రతుకు నేర్పిన పాఠం. మొహమాటానికీ ముఖప్రీతి మాటలకూ లొంగిపోతే మన్నుతిని పోవలసిందే ఇక్కడ."

"ఛ. ఛా మీలాంటివారి దగ్గర మాకేం అనుమానం? కాని ముందుగా డబ్బిస్తేగాని ఓనరు ఒప్పుకోడు........ ఇవ్వండి" ముగించేసింది అమ్మాజీ.

పది రూపాయలు తీసిచ్చాడు అతను. అమ్మాజీ బయటకువెళ్ళి అతనిచ్చిన డబ్బు కనకమ్మకు ఇచ్చి. తిరిగి గదిలోకి వచ్చేసరికే అతను బట్టలు విప్పుకొంటున్నాడు. అమ్మాజీ తలుపువేసి. పెద్దలైటు తీసేసి బెడ్ రూమ్ లాంపు వేసింది.

"మరి నాకో?....కాఫీకి...."

మరో రెండు రూపాయలు.

"ఇంతేనా?... మీలాంటివారు కూడ...."

"ఇస్తానుగా...." అన్నాడు అతను. కాని అమ్మాజీకి తెలుసు. ఈ క్షణం దాటితే అతని దగ్గర్నుంచి నయా పైసా కూడ రాదు.

అంతలోనే తలుపు తట్టారు ఎవరో మెల్లగా. అమ్మాజీ లేచి తలుపు తెరిచింది. సావిత్రి!

"ఏమిటక్కా?" అమ్మాజీ అడిగింది.

"అతను వచ్చాడు... నీకోసం...."

అమ్మాజీ ఆలోచనలో పడిపోయింది. "ఇప్పుడెలా అక్కా, లోపల ఒకతను ఉన్నాడు...." లోపల ఉన్న మనిషికి వినిపించకుండా అన్నది అమ్మాజీ.

"ఉంటే ఉన్నాడులే. ఎవడో కొనకిస్కాగాడికోసం అయ్యన్న కాదంటావా?"

"నాకూ అలాగే ఉంది అక్కా. కాని వీడెవడో నా ప్రాణానికి దాపురించాడు. డబ్బు కూడ తీసుకున్నాను. ఇప్పుడు వీల్లేదంటే గొడవ చేస్తాడేమో?" అన్నది అమ్మాజీ.

సావిత్రి చాకులాంటి యువతి. ఒక్క క్షణం ఆలోచించి "ఐతే ఉండు. నేనిప్పుడే వస్తాను. నువ్వు తలుపేసుకో" అని వెళ్ళిపోయింది.

అమ్మాజీ పరధ్యానంగా గదిలోకి వచ్చి తలుపు వేసింది.

ఐదు నిముషాల తర్వాత మళ్ళీ తలుపు చప్పుడైంది... ఈసారి దబదబా... కొంపలేవో మునిగిపోతూన్నట్టు. అతను విసుక్కున్నాడు. అమ్మాజీ తలుపు తెరిచేప్పటికి "పోలీసులు — పోలీసు లొస్తున్నారు!" రొప్పుతూ అనేసి అక్కణ్ణుంచి పరుగెత్తుకొంటూ వెళ్ళిపోయింది సావిత్రి.

బట్టలన్నా సరిగ్గా వేసుకున్నాడో లేదో అతను వాకిట్లో నిలబడివున్న అమ్మాజీని నెట్టుకొంటూ తుఫానులా బయటకు దూసుకెళ్ళిపోయాడు.

సావిత్రి నవ్వుతూ గదిలోకి వచ్చింది.

---

ఆడపిల్లలవద్ద రహస్యాలు మగపిల్లల వద్ద వున్న టపాకాయలతో సమానం. అవి పేల్చేసేవరకు వీరికి తోచదు. వాటిని బయట పెట్టేవరకు వారికి నిద్రపట్టదు.

—క్రాబే

---

"పాపం ఊరువాటి పొయ్యాకైనా వెనక్కి తిరిగి చూస్తాడో లేదో! పిరికిసన్నాసి!"

సావిత్రి వెనకనే మరో యువకుడుకూడ లోపలకు వచ్చాడు. సన్నగా పొడవుగా పాతికేళ్ళు వుంటాయేమో. తెల్లని పైజమా, షర్టు.

"కూర్చోండి" అన్నది అమ్మాజీ వికసించిన ముఖంతో.

అతను మంచంమీద కూర్చున్నాడు.

"వెళ్తానే నేను....కనకమ్మకి తెలిసిందంటే నన్ను చంపేస్తుంది పాడుముండ" అంటూ సావిత్రి వెళ్ళిపోయింది.

ఆ యువకుడు, అమ్మాజీ ఒంటరిగా మిగిలిపోయారు.

"మీరు నిన్ననే వస్తారనుకొన్నాను" అన్నది అమ్మాజీ.

"ఊరెళ్ళాను. రావటం ఆలస్యమైంది" అతను జేబులోంచి పదిరూపాయలుతీసి అమ్మాజీకి ఇవ్వబోయాడు.

"ఎందుకూ?" సిగ్గుపడిపోయింది అమ్మాజీ.

"నీ టైము ఉపయోగించుకుంటున్నందుకు! తీసుకోవటం నీకు ఇష్టం లేకపోయినా మీ ఓనరు ఊరుకోదుగా. తీసుకో అమ్మాజీ. బాధపడకు- నేను అర్థంచేసుకోగలను!"

అమ్మాజీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతనికి కనిపించకుండా ముఖం మరో పక్కకు తిప్పుకొంటూ "పాపిష్టి బ్రతుకు మాది, ఏంచేస్తాం! ఐదు రూపాయలివ్వండి చాలు. దాని వాటాదాని ముఖాన కొడితే నోరు మూసుకుని పడివుంటుంది" అన్నది.

ఐదు రూపాయలూ కనకమ్మకిచ్చి, తిరిగి గదిలోకి వచ్చింది అమ్మాజీ. దిండు వేసుకొని గోడకు ఆనుకొని కూర్చుని ఉన్నాడు ఆ యువకుడు. అమ్మాజీ అతనికి దగ్గరగా మంచంమీద కూర్చుంది. ఇద్దరిమధ్యా మాటల్లేవు. ప్రేమ వెల్లివిరిసే చూపులతో అతనూ, తృప్తి, మార్దవం నిండిన చూపులతో అమ్మాజీ ఒకర్నొకరు చూసుకొంటూ అలాగే ఉండిపోయారు. అదే తృప్తి వారికి.

చివరకు అమ్మాజీయే అడిగింది "నేనంటే మీకింత....ప్రేమ .. ఎందుకండీ?"

ఆ యువకుడు నవ్వాడు. "ఏమో....తెలియదు! ఒకర్ని చూస్తే ప్రేమా మరొకర్ని చూస్తే అయిష్టం ఎందుకు కలుగుతాయో ఎవరు చెప్పగలరు?....అమ్మాజీ నే నివ్వాళ ఒక నిర్ణయానికి వచ్చాను. నువ్వు ఇష్టపడితే నిన్ను పెళ్ళి చేసుకుని ఈ నరకంనుంచి బయటకు తీసుకెళ్తాను!"

అతని మాటలకు ఉద్విగ్నురాలై పోయింది అమ్మాజీ. కళ్ళ వెంట ఆనందబాష్పాలు. "నన్నా! నన్నా! నేను బజారు మనిషిని! మీరు పెళ్ళి చేసుకోవాలంటే నాకంటే మంచివాళ్ళు ఎంతోమంది దొరుకుతారు మీకు?-"

"కాని నాకు నువ్వేకావాలి!.... మాట్లాడవేం అమ్మాజీ! నీకు ఇష్టంలేదా! చెప్పు! ఇష్టంలేదంటే వెళ్ళిపోతాను"

"కాదు.... కాదు! ఉండండి- నాకంతా ఏదోగా ఉన్నది. నమ్మలేకపోతున్నాను! కొంచెం టైమివ్వండి....దయచేసి...."

"పిచ్చిపిల్లా! అలాగే. తొందరేం లేదు. నీకోసం ఎంతకాలమైనా ఆగగలను నేను. వెళ్తాను" అంటూ పైకిలేచాడు ఆ యువకుడు. "మళ్ళీ రెండు మూడు రోజుల్లో వస్తాను. అప్పుడు చెప్తావుగా నీ జవాబేమిటో?"

"వెళ్ళొద్దు! ఊరికే మిమ్మల్ని అలాచూస్తూ కూర్చుంటాను వుండండి" ప్రతిమాలింది అమ్మాజీ.

"పిచ్చిపిల్లా! ఈసారి వచ్చినప్పుడు రాత్రంతా నీదగ్గిరే వుండిపోతాను. ఈరోజు మాత్రం నాకు సెలవివ్వు! బయట ఒక స్నేహితుణ్ణి నిలబెట్టి వచ్చా-"

అతను వెళ్ళిపోయాక చాలాసేపటివరకూ ఒళ్లు పులకరించే మధురమైన ఊహలతో తన్ను తాను మర్చిపోయి అలాగే నిలబడిపోయింది అమ్మాజీ.

అమ్మాజీతో కలుపుకొని ఆ యింట్లో మొత్తం ఐదుగురు యువతులు వున్నారు. ఎక్కడ పుట్టారో, ఎలా పెరిగారో, ఎందుకు ఈ వృత్తిలో దిగారో- ఒక్కొక్కరిది ఒక్కొ-

కథ! ప్రస్తుతం ఇక్కడ, రేపు మరెక్కడో? అందరికీ ఒకేరకం బాధలు. ఒకే రకం సమస్యలు. ఎక్కడున్నా-ఉన్నన్నాళ్లూ ఒకరినొకరు ఓదార్చుకొంటూ అక్కచెల్లెళ్ళలా కలసి ఉంటారు అంతా. అయినా అమ్మాజీ, సావిత్రి మాత్రం మరీ దగ్గరగా, రహస్యాలేవీ లేకుండా తోబుట్టిన వారికంటే ఆప్యాయంగా ఉంటారు.

ఒకరోజు అమ్మాజీ సావిత్రితో అన్నది "అక్కా, నీకో సంగతి చెప్తే నమ్ముతావో నమ్మవోగాని....ఆయన....ఇన్నాళ్ళనుంచి నా దగ్గరకు వస్తున్నాడు కదా, ఒక్కరోజుకూడ నన్ను ముట్టుకోలేదు."

ప్రతిరోజూ మధ్యాహ్నం దొడ్లో బావి దగ్గర బట్టలు ఉతుక్కోవటం ఆ ఇంట్లోవున్న యువతుల దినచర్య. కనకమ్మకు అనుమానం కలుగకుండా రహస్యాలు చెప్పుకోటానికి అది మంచి అవకాశం.

"పెళ్ళి చేసుకోమని అడుగుతున్నాడు కదూ?" సావిత్రి ప్రశ్నించింది.

తన మాటలకు సావిత్రి ఎంతో ఆశ్చర్యపడిపోతుందనుకొన్న అమ్మాజి, సావిత్రిప్రశ్నకు తానే ఆశ్చర్యపడవలసి వచ్చింది. "ఔనక్కా? నీకెలా తెలుసు?"

సావిత్రి అమ్మాజీకంటె నాలుగైదు సంవత్సరాలు పెద్దది. జీవితంలో ఎన్నో అనుభవాలు రుచి చూసిన వ్యక్తి. "నేను అతన్ని చూడగానే గ్రహించాను. మనసులో పవిత్రమైన భావం ఉన్నవారే అలా ఉండగలరు! ఎందుకోగాని నువ్వంటే అతనికి అలవిమాలిన ప్రేమ!.... అతన్ని పెళ్ళిచేసుకోవటానికి నువ్వు ఒప్పుకున్నావా?"

"నేనింకా సమాధానమేమీ ఇవ్వలేదు అక్కా! కాని కోరిన వ్యక్తిని పెళ్ళాడి నలుగురిలో గౌరవంగా బ్రతకడంకన్నా మనలాంటి వారికి కావలసిందేముంది చెప్పు? శరీరమూ, మనసు కూడా చంపుకొని, హీనాతిహీనమైన బ్రతుకు బ్రతుకుతూ సంపాదించేదేమో మనం- పోలీసులు, రౌడీలు, ఓనర్లకేమొ-అందులో వాటాలు! ఇదేం న్యాయమక్కా? ఇంత కష్టపడినా చివరకు మనకు మిగిలేది రోగాలేకదా?" అన్నది అమ్మాజి.

"అంతేనమ్మా! భగవంతుడు మన నొసటన అదే రాసిపెట్టాడు! ఒకసారి అడుగు పెట్టాక యీ నికృష్టపు బ్రతుకు మనకు తప్పదు!"

"అందుకే అక్కా, నేను ఆయన్ని పెళ్లాడి యీ నరకంలోంచి బయటపడాలనుకొంటున్నాను-మంచిదే కదక్కా?"

సావిత్రి సమాధానమేమీ యివ్వలేదు. మనసులో ఏవేవో గతస్మృతులు.

"సమాధానం చెప్పవేం అక్కా?" అమ్మాజీ మళ్ళీ అడిగింది.

సావిత్రి మనసులో తర్జన భర్జనలు. చెప్పటమా వద్దా అన్న సంశయం........చివరకు


అన్ని ప్రాంతాలలోను ఏజెంట్లు కావలెను

పద్మాలయ పిక్చర్సు **అల్లూరి సీతారామరాజు** (సినిమాస్కోప్-కలరు)

చిత్ర విచిత్రాలు పుస్తకరూపంలో వెలువడుతుంది.

పంచరంగుల ముఖ చిత్రంతో ఏప్రిల్ 5 వ తేదీ వెలువడనున్న ఈ పుస్తకం వెల ఒక రూపాయి. ఏజెంట్లు, కావలసిన కాపీలకు 25% కమిషన్ మినహాయించుకొని డబ్బు పంపినయెడల కాపీలు పంపబడును, వెంటనే ప్రతులకు వ్రాయండి.

—మేనేజరు, స్వాతి పబ్లికేషన్స్,
పోస్టుబాక్సు నెం. 339, గవర్నరు పేట, విజయవాడ-2.

మెల్లగా అన్నది: "అమ్మాజీ, నేనొకసంగతి చెప్తాను విను. నాలుగేళ్ళక్రితం నేను రాజమండ్రి గుండూరావు కంపెనీలో ఉంటూన్నప్పుడు నాతోపాటు కాకినాడ పాప అని ఒక అమ్మాయి ఉండేది. అసలుపేరు సరళ. చదువుకొన్నదికూడా! ఇలాగే ఒకతను ఆ అమ్మాయిని ప్రేమించి, పోలీసులకు డబ్బిచ్చి వాళ్ళ సహాయంతో ఆ అమ్మాయిని అక్కణ్ణుంచి లేవదీసుకెళ్ళి పెళ్ళి చేసుకున్నాడు. దాని జీవితం బాగుపడింది కదా అని మేమంతా ఎంతో సంతోషించాం! కాని లోకం వాళ్ళను బతకనివ్వలేదు. కాకుల్లా పొడవటం మొదలెట్టింది. రకరకాల వత్తిడులు అతను భరించలేక చివరకు దాన్ని వదిలేసి మరో అయినింటి పిల్లను పెళ్ళి చేసుకున్నాడు. మూడేళ్ళపాటు నిజమైన ఇల్లాలుగా, ఎంతో గౌరవంగా కాపరం చేసిన కాకినాడ పాప మళ్ళీ తన పాత వృత్తిలోకి దిగలేకపోయింది. పొట్టగడుపుకునే వేరే దోవ తెలియదు. చివరకు గోదావరిలో దూకి ప్రాణాలు తీసేసుకున్నది! నీకు తెలుసుగా మనం ఈ వృత్తిలో నిలబడి ఉండాలంటే ఎంత హుషారుగా, ఎంత కరుకుగా, ఎంత నిర్మొహమాటంగా ఉండాలో? ఒకసారి బయటికివెళ్ళి ప్రశాంతమైన ఆ జీవితం రుచి చూశాక మనలో ఆ కరొడా తనం, ఆ తెలివీ మాయమైపోతాయి. సాత్వికమైన గృహిణి లక్షణాలు అబ్బుతాయి. అప్పుడిక మళ్ళీ ఈ వృత్తిలో ప్రవేశించినా, ఇందులో ఉన్న తోడేళ్ళ మధ్య మనం బ్రతకలేం. ఇది బాగా ఆలోచించుకోవలసిన విషయం!"

సావిత్రి కాకినాడ పాప కథ తనకు చెప్పటంలో ఉన్న ఉద్దేశ్య మేమిటో అమ్మాజీకి చాల సేపటివరకూ అర్థంకాలేదు. అర్థం చేసుకోవాలనే ప్రయత్నంలో ఉండగనే మొండి గోడమీద కోతి కనుపించింది. కోతులంటే అమ్మాజీకి విపరీతమైన భయం! "అమ్మో, కోతి!" అంటూ ఇవతలకు గెంతేసింది అమ్మాజీ! ఆ కోతికూడ భయం భయంగా చూస్తూ, పొయ్యింట్లో అన్నం తింటూన్న కనకమ్మ కూతురు- ఐదేళ్ళపాప ముందున్న పళ్ళెం లాక్కుని ఆవురావురుమంటూ తినటం మొదలెట్టింది.

"ఓసి నీ ముఖంమండా, నీకెక్కడ ఇంత ధైర్యమూ!" అంటూ సావిత్రిచేతిలో ఉన్న చెంబుతో ఆ కోతి తలమీద ఒక్కటిచ్చుకొన్నది!, పళ్ళెం వదిలేసింది కోతి.

అమ్మాజీ గుండెమీద చెయ్యి వేసుకొని "అమ్మో నీకెంత ధైర్యం అక్కా! మొన్న ఒకకోతి మేమంతా కర్రలు పట్టుకొని వుండగానే నాగులుమీదపడి రక్కిపెట్టింది! ఇప్పుడు నిన్నుకూడా అలాగే రక్కివేస్తుందేమో నని భయపడిపోయానంటే నమ్ము!" అన్నది.

సావిత్రి నవ్వి "దీనికి అంత ధైర్యంఎక్కణ్ణుంచి వస్తుందే! ఇది పెంపుడు కోతి! మనింటి కెదురుగా గుడిసెలో ఒక ముసలాడు ఉండేవాడు గుర్తుందా?

బతికుండగా అడుక్కొన్న తిండిలో కాస్తో కూస్తో దీనిముఖాన వేస్తూండేవాడు. పాపం, వాడు చావటంతో ఇది బజార్న పడింది. పెంపుడుకోతి కదూ, మనుషులంటే తగని భయం దీనికి" అన్నది.

(మర్నాడు మన కథానాయకుడు వచ్చి, అమ్మాజీని పెళ్ళి విషయం అడిగినప్పుడు, అమ్మాజీ అందుకు అంగీకరించలేదని మీకు చెప్పనక్కర్లేదనుకుంటాను. కాని మానవుల మంచితనంమీద విశ్వాసం కలగకపోవటానికీ, ఉన్న వృత్తిని వదులుకోలేకపోవటానికీ గల కారణాలేమిటో, అమ్మాజీని ఆ నిర్ణయానికి పురిగొల్పిన జీవితానుభవాలేమిటో నాకూ తెలియవు.) ★

